# కామకోటి

"సూచయంతి సుందరి...తవ...సూచయంతి సుందరి! కుసుమాయుధ శాస్త్ర పండితమ్...రమణమ్..."

...కోపం తలమునుకలుగా...సంస్కృత గ్రంథాలన్నింటికీ...వెనుక భోజరాజు చరక సుశ్రుతాదులకు తలపెట్టిన సత్కారంచేయాలని...లోకాన్నంతా...

ఓ!...నిలువలేనంత చిరాకు ఎత్తుకు వస్తున్నది.

అప్పటికి నాలుగురోజులనుంచీ ప్రయత్నం చేస్తున్నాను...మరిచిపోదామని; కాని, మేలుకున్నా కలువరింపు మానే ఉపాయం తోచడంలేదు. ఆ పద్యార్థం లాషాలాగా...పట్టుకుని వదలకుండా ఉన్నది.

మొదట...తమాషాగా...ముచ్చటపడి నవ్వుకున్నాను: తరువాత, కొంచెం చిరాకు తెచ్చుకున్నాను: ఇప్పుడు...గింజుకుంటున్నాను; ఉహుఁ...ఏ సుముహూర్తమున నన్ను వరించిందో. ..ఏమో...వెన్నెల వచ్చింది.

క్లబ్బునుంచి అప్పుడే యింటికి వస్తున్నాను; గుమ్మానికి పెడల్ డీకొట్టకుండా, కాలితో ఆచుకుని, సీటు దిగకుండా...పని అయిపోయినా...చిగురుదమ్ముల పస తెలిసిన రసికుణ్ణి గనుక పెదవులకు అంటే చురుకును సహించుకుంటూ, శేషరూపలేశమైన సిగరెట్ – కన్యను బలవంతాన మరో రెండు వలపులు వలచి... మేనకకు ఉద్వాసన చెప్పి తప్పించుకున్న గాధేయుడి దర్జాతో లోపల ప్రవేశించాను.

కోటు కుర్చీమీదకు...విప్పాకు నేటట్టు విసిరివేసి, రేకెట్ ప్రెస్‌లో అమర్చి కూర్చుని షూ తీసివేస్తూ... పరధ్యానంగా...తవ సూచయంతి...సుందరి...

'నాయనా!'

...మెలకువచ్చినట్లయింది: మనస్సు చేస్తూన్న మోసం తెలిసిపోయింది. కాని...కన బడని వస్తువుమీద, పగ ఎలా సాధించడం? నిలుచుని...ధూకుడుగా...ఏ పాపమునూ ఎరుగక, నా పాదములే నమ్ముకొని ఉన్న...షూజ్‌ను...తన్నేశాను. తల ఎత్తి చూశాను.

జాలిగా, దీనంగా, కన్నీళ్ళతో, నా పలుకరింపుకు ఎదురుచూస్తూ...అమ్మమ్మ!

కలకలలాడుతూ...ఎప్పుడూ సిరి ఒడిపోతూండే పండుముత్తైదువ అలా ఉండటానికి కారణం?

'ఏం...ఏమిటి?' అని గాభరాపడుతూ అడిగాను; ఆమె మాటాడలేదు. కళ్ళవెంట మరీ, జల జలా...

'ఏం...ఏమిటి మాటాడవేం?' రెట్టించాను. సంగతి ఏమిటో అర్థంకాదు. నాకు మనసు నిలవడంలేదు.

'తాతయ్య ఏడీ?'

అడగడం వ్యవధానంగా...నానోటివెంట ఆ రెండు ముక్కలూ వస్తూండగానే అమ్మమ్మ శ్రుతి ఎక్కించింది; నాకు మతి సాపుగా పోయింది.

ఆమె ముందూ, అనుసరించి నేనూ అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వెళ్ళాము. చుట్టు తిరగకుండా, మడి వసారా తలుపు తీసుకుని...తులసికోట పక్కనుంచి, తోటలోనికి వెళ్ళేసరికి...

చూసే చూడటంతోనే, నవ్వు పట్టలేక పోయినాను. తాతయ్య మామిడి తిన్నెమీద పద్మాసనం వేసుకుని, చిత్రాసనంమీద కూర్చుని, చిన్ముద్రలు సవ్యాప సవ్యములు చేసుకుంటూ...దృష్టిని ఊర్ధ్వాభిముఖంచేసి, భ్రూమధ్యాన నిలుపుకోవడానికి యత్నంచేస్తూ, అచల సమాధిలోకి వెళ్ళిపోయే హంగామాతో ఉన్నాడు.

...ఉద్దండుడు, యేదో పథకం పన్నుతున్నాడు; అలా కాకపోతే...ఏమిటి యీ చోద్యం? మదన సామ్రాజ్యానికి యావత్తూ ప్రధాన అమాత్య పోదాలో వాడే...వర్షీయసి ముక్తికాంత ఉపగూహనం కోసం, రాచకార్యాలు కట్టిబెట్టుకుని కూర్చోగల తీరిక ఉన్నదా? వేదాంతమా అంటే, ఛాందోగ్యం పాఠం చెపుతూ, దహరాకాశాన పరమాత్మకు ఉనికి ఉన్నా, మానినా, ప్రణయజ్యోత్స్నలు అక్కడ వాలలాడిపోతూండవలసినదేనని... పంతానికి సాధించిన భావుకుడే!...మరి ఏమిటి ఈ వాలకం?

ఇక ఆలోచించకుండా ఆయన కొంటెతనానికి పైఎత్తుగా సాగిలపడి మ్రొక్కి, లేచి, పేంట్సుమీద మోకాళ్ళకు అంటిన మన్ను దులుపుకుంటూ, చేసిన ఘనకార్యానికి అభినందనా లేమైనా తగులుతాయేమోనని...అమ్మమ్మవంక చూశాను.

...లాభించలేదు: పైగా, ఆమెకు నా అల్లరి అర్థం కాకపోవడం అటుండగా 'నీవూ' మీ తాతగారు చేసిన పనికి హర్షిస్తున్నావా' అనే అర్థపు చూపుపెట్టి...మన్యువేగం నిలవదీసుకుంటూ...

'ఇదీ వరుస, నాయనా! సంధ్యపడకముందునుంచీ, ఎన్నో విధాల బ్రతిమాలాను. కాళ్ళు పట్టుకున్నాను, నెత్తీనోరూ కొట్టుకుని 'ఇది మీకు తగదు' అని మొరపెట్టాను. నీవుకూడా చెప్పి చూడు, అప్పటికీ ఆయన మనసు మారనట్టాయెనా, నన్ను భరించడానికి ఆ గంగాభవానే ఉంది! ఇంతకాలానికి...ఇన్నేపడిలో...నన్ను విడిచేసి...సన్యసించుతారా?' అన్నది గాద్గదికంగా.

నేను, ఆమె మాటకు అడ్డం వెళ్ళి,

'ఇప్పుడు ఆ సంగతేం వచ్చిందీ? నీమీద కోపంగా ఉన్నాడా?'

ఆమాట అడుగగానే, వాళ్ళ సంసారిక ప్రణయాన్ని అవమానించానని, కోపంవచ్చి, ఆమె చూపు చురచురలాడింది—ఆ పుణ్యదంపతుల విషయంలో అలాంటిది అసంభవం అని తెలుసును. కాని, కేవలం మాటవరుసకని అని...చేసినతప్పు దిద్దుకుంటూ—

'ఏం జరిగిందో చెప్పు, నాకు తెలియదు కాదూ!' అని సానునయంగా అడిగాను.

'అకారణంగా, ఉన్నవారు ఉన్నట్టుగా...'సన్యసించితే మేలు' అని అనుకుంటూ, లేచివచ్చి ఇక్కడ కూర్చున్నారు. మాటా మంతీ లేదు; ఉలకరు...పలకరు. కోపమేమో ననుకుందామా...ఆ మహారాజు ఎన్నడన్నా పల్లెత్తి ఒకమాట అనడం విన్నావా?"

'ఒక మాటేమిటి? నిమిషానికి లక్షమాట లంటూొండటం ఎరగనూ? తాతయ్య తన రసికత్వమంతా, నీ మీదనే పదును చేస్తూంటాడాయెను...'ఈ ధోరణిలో...ఆమె దిగులు మరపించడానికి విసిరి చూశాను పనిచేయలేదు.

"వాటికేంలేస్తూ...యిప్పుడు ఏమిటి చేయడం?"

"ఏమీ చేయకుండా, చూస్తూ ఊరుకోవడం."

"ఏమీ చేయక..."

"స్వాములారీ లోకంలోకి ఇంకా పూర్ణంగా దిగనీ. అప్పుడు సుష్టుగా భిక్షచేద్దాం. అందాకా ఏమీ తొందర లేదు. మనం, ఒకవేళ ఈలోపల ఏమన్నా చేద్దామన్నా ఆయనేం ఊరుకునే రకమా?"

ఈ ధఫాతో, నేనేమీ, అర్చేవాడినీ, తీర్చేవాడినీ కాదని ఆమెకు తెలిసిపోయింది. ఇక నా మాటలు వినిపించుకోకుండా పునః తిన్నెను అనుకుని కూర్చుని ఆయన బాసెపెట్టు దగ్గరగా తల ఒరగిలవేసి విలపించడం మొదలుపెట్టింది.

"భిక్కునీ"

...నకనకలాడే సింహం, గుహాముఖమున గర్జించే దమ్ముతో, తాతయ్య మౌనమూర్తి ధ్వనించింది. నేను ఫక్కుమన్నాను. ఏం ప్రభూ! బౌద్ధంలోకి మార్చాడే బాణీ...అదుగదీ, ఇప్పుడూ అసలు రంగంలోకి దిగుతున్నాడు. ఆశ్రమ స్వీకారానికైనా...అడ బాహుళ్యం ఉన్న సంప్రదాయం ఏరుకున్నాడు.

–అమ్మమ్మ ఆ మాట ఏదో తిట్టూ అనుకుని, ఉలికిపడి, తెల్లమొగం వేసి...లేచి దూరానికి తప్పుకున్నది. స్వాములు కళ్లు...రెప్ప లల్లార్చి తెరిచారు.

"జయము శ్రమణ భదంత కామాయనులకు!" అని నేను ప్రత్యుత్థాన స్వస్తివాచకమాడాను.

తాతగారు, విజృంభించి...ఒళ్లు మలుపులు సర్ది విరుచుకుంటూ,

'అయితే మనకేంలే! అగ్ని పేటిక, మిగతా సరంజామా, ఇలా రవాణా చెయ్యి. సన్యసిద్దామనుకున్నాను కాని, ఉన్న పాయ ఊరికే పారవేయడం ఎందుకూ?...నేను తప్ప తట్టుకునే నాధుడు లేడాయెను, ఈ యింట్లో... రేపు పాగోలు సరుకు ఊళ్ళో దిగితే బాగుండును.'

'మరి నీ సన్యాసం!'

తాతయ్య మాట మెలకువ అర్థంచేసుకోలేని అమాయికతనం చూపులో తొణికించి...నాకు విప్పి చెప్పుతున్నట్టుగా...

'గీర్వాణం వెలిగించానయ్యా! ఈ పొగాకు పసిగా లేదు, మానివేద్దా మనుకున్నాను...అది స్వగతంగా...అర్థోక్తిలోనే...అసలు మనసుదాటి రానీయకుండా ఉండవలెననే మాటే మరచిపోయినాను. సంకల్పం పవిత్రమైనది. గనుక, కూతురు ఎందుకని తల్లినే ఆశ్రయించాను... తలదిమ్ము...తిక్క... తీరేందుకు తరుచ్ఛాయ...

'అందుకూ మా గృహిణికి యింత అలుక. కసి తీర్చుకున్నానుగా, 'భిక్కునీ' అని తిట్టి. ఏం అషోనా? ఇంటావిడా.

ఇంకో విషయం...విశేషం ఉందోయ్...వేళకు సరిగ్గా అన్నీ అల్లా సరిపోయినాయి చూడు...నీవు, సంఘం సరే, ఈ ఆరామం, మరి భిక్కునో?–'

నేనూ, నాతోబాటు అమ్మమ్మా, తాతయ్య శ్రుతి అందిపుచ్చుకుని...నవ్వాము.

'పాపం! హడిలిపోయిందయ్యా!'

'అలాకాదు: మాట దక్కించింది. మీ అమ్మమ్మే. విరహవేదన ఎంత మజాగా అభినయించేదనుకున్నావు... పడుచుదనంలో? ఒకమారు చూద్దామని ముచ్చట వేసింది. ఫరవాలేదు–వెనుకటి బింకం ఏలా వస్తుంది కాని?...నేను మాత్రం...ఇప్పుడు నిత్యం...భోజనానంతరం రాత్రులు... మహాభినిష్క్రమణంచేస్తున్నానా ఏం...ఉద్దీపన లేందే వీణ మోగదు.'

'ఎంత నాటకం ఆడావూ?'

'అవును బాబూ...మా ముసలి ముచ్చట్లు మేమే తీర్చుకోవాలి కాని...ఎవరు అదుకుంటారు?...'

...వాక్ప్రవాహానికి, చప్పున అడ్డుకట్టవేసి...తాతయ్య...చెవులు దోరబెట్టుకుని... వింటున్నాడు.. .కారుమబ్బులు దూసుకుని...ఫెళ్లున వెలిగే చందమామలాగా...ఆయన ముఖం కలకలలాడిపోయింది...అంటించబోతూన్న చుట్టను...తీసి, చేత బుచ్చుకుని...అతి హుషారుగా...లేచి నిలుచున్నాడు. నేనూ...సిగరెట్...ఆ పరిస్థితిలో అంటించడమా మానడమా అనే విచికిత్సలో పడిపోయినాను...తాతయ్య. ..ఇంత హంగామా చేసిన తరువాత...కొంచెం తెప్పరిల్లేదాకా...ఆయనను అక్కడనుంచి కదలనియ్యదలచుకో లేదు...వదలదలచుకోలేదు.

'కూర్చో...'

'వీలులేదు...శివాజ్ఞ అయింది: పలుచని పద్మినులను వల...చే సుకుమార రసికులు ఆయెను– మీ సజ్జు అంతా...నీవు రికామీగా, కూర్చుని...కాల్చుకో...పొగల తీగలెలలోనే...మీకు... ప్రియురాలి వగలన్నీ కుసుమిస్తవి...మేం...అంత తీరుబడికి మా పడుచుదనంలోకూడా నోచుకోలేదుసుమా!...ఎందుకు...చెవులూ, కన్నులూ కలిగిన లాభం ఇంకా వినిపించడం లేదూ?'

ఒకరిని మించాలని ఒకరము...పందెం వేసుకున్నట్లుగా...అంగలతో దూకుతూ.. వాకిటిలోకి వచ్చాము...అమ్మమ్మ మాటే మరచిపోయి.

ఇంటిముందర పెళ్ళివారు ఎవరో, ఊరేగుతూ అగారు. మేళంలో...పచ్చసిల్కు వోణి వేసుకున్న ఓ పిల్ల...

'రమ్మనే! మహరాజుగ...', అనేపదం పల్లవి ఎత్తుకుని అభినయిస్తూన్నది.*

★ ★ ★

* తాతగారి కథలలో – మూడవది.

"అతిథ్యం" – "గురుప్రసాదం" జ్వాలలో ఇదివరకు అచ్చుఅయినవి–మ.రా.శా.